క్లుప్తంగా

స్థల కేటాయింపుపై హర్షం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అమరావతిలో అమర జీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 6.80 ఎకరాల స్థలం కేటాయించడంపై వాసవి జాగృతి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం పోరాడి అసువులుబాసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన పొట్టి శ్రీరాములు స్మృతి వనాన్ని తొందరగా పూర్తి చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ



పరివర్తన పాఠశాలలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బ్యాంకుల జాతీయీకరణ 56వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏలూరు పట్టణంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు దొండపాడులోని పరివర్తన్ స్పెషల్ స్కూల్‌లో విద్యార్థులకు పెన్స్, పెన్సిల్, షార్పెనర్, ఎరేజర్ మొదలైన స్టేషనరీ పంపిణీ, బ్రేక్ ఫాస్ట్ అందజేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షులు దుగ్గిరాల శ్రీనివాస మోహన్, యూనియన్ బ్యాంక్ ఏలూరు జిల్లా రీజనల్ సెక్రటరీ ఎన్ లక్ష్మణరావు, యూనియన్ బ్యాంక్ నాయకులు సాయికుమార్, చంద్రశేఖర్, బ్యాంక్ ఆఫ్ బరోడా నాయకులు శ్రీనివాస్, బ్యాంక్ ఆఫ్ ఇండియా నాయకులు సుబ్రహ్మణ్యం, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: పదేళ్లలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని చాటపర్రు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ రామాంజనేయులు, సూపర్‌వైజర్ కిరణ్ కుమార్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం చాటపర్రు గ్రామ శివారు ప్రాంతాల్లో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఏఎన్‌ఎం సంధ్యారాణి ఆధ్వర్యంలో వేశారు. ఈనెల 26 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు చిన్నారులకు ఈ వ్యాక్సిన్లు తప్పక వేయించాలని ఆయన కోరారు.



ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద క్రాస్‌రోడ్స్ పేరుతో ట్రాఫిక్ పార్క్



పార్కులో ట్రాఫిక్ పోలీస్ సూచనతో ఎంట్రన్స్



ట్రాఫిక్ పార్కులో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో

ఏలూరులో ట్రాఫిక్ పార్క్

- బాలలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన
- ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు


ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో బాలలకు ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిస్తూ ట్రాఫిక్ పార్క్ ఏర్పాటు చేశారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధతో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని మొక్కలు, ఆటవస్తువులు, వ్యాయామం చేసేలా సుమారు రూ.84 లక్షల వ్యయంతో పార్క్‌ను తీర్చిదిద్దారు. ఈ పార్కు పట్ల చిన్నారులు ఆసక్తి చూపిస్తున్నారు.

క్రాస్ రోడ్స్... ట్రాఫిక్ పార్క్

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే క్రాస్ రోడ్స్, ట్రాఫిక్ పార్క్‌ను ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, జిల్లా పోలీస్ శాఖ సంయుక్తంగా అభివృద్ధి చేశారు. ఈ పార్కులో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన సిగ్నల్స్, సైన్ బోర్డ్స్, ఆట స్థలం, వివిధ రకాల ఆటల పరికరాలు పిల్లలను ఆకర్షిస్తున్నాయి. రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో రోడ్డుకు పక్కగా ఏర్పాటు చేసే సిగ్నల్స్ ఏ విధమైన నిబంధనలను తెలియజేస్తాయో పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు. అతివేగంగా ప్రయాణించకూడదని, సురక్షితమైన ప్రయాణం చేసేలా పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. వీటితోపాటు భారీ చెట్లు, ఆహ్లాదకరమైన వాతారణం, స్వల్ప వ్యాయామాలు చేసే జిమ్‌ను సైతం పార్కులో ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పార్కులోకి పిల్లలను అనుమతిస్తున్నారు.



ట్రాఫిక్ పార్కులో సిగ్నల్స్



రవాణాశాఖ జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్



ట్రాఫిక్ పోలీస్

జిల్లాలో ప్రథమ ట్రాఫిక్ పార్క్



జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ట్రాఫిక్ పార్కును నిర్మించారు. ఒకవైపు నిత్యం స్కూల్స్, కాలేజీల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. కానీ చిన్నతనంలో పిల్లలకు ఇష్టమైన రీతిలో ఆడుకుంటూనే ట్రాఫిక్ సిగ్నల్స్ పట్ల, నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు స్వేచ్ఛగా ఆడుకుంటున్నారు.

– ఎస్ లక్ష్మణరావు, సీఐ, ట్రాఫిక్ స్టేషన్, ఏలూరు

22న ఏలూరులో ఉద్యోగ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్), ఏపీఎస్ ఎస్ డీసీ సంయుక్తంగా ఈ నెల 22న మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం, ఏలూరులో ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేళాలో వివిధ ప్రముఖ సంస్థలు పాల్గొంటాయని, హెల్పర్, టైలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలర్, మెకానికల్ హెల్పర్, మార్కెటింగ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, ట్రైనర్స్ పోస్టులు కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 88868 82032లో సంప్రదించవచ్చున్నారు.

మునిసిపల్ కమిషనర్‌పై చర్యలకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికుల ఆత్మహత్యాయత్నంపై విచారణ చేయించాలని, అందుకు కారణమైన మున్సిపల్ అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ బూతులు తిట్టడంతో శుక్రవారం మనస్తాపంతో నూజివీడుకు చెందిన ఇద్దరు మున్సిపల్ కార్మికుల ఆత్మహత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. వారిని చికిత్స నిమిత్తం బంధువులు నూజివీడు ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారని తెలిపారు. బాధితురాలు డి.పైడమ్మ మాట్లాడుతూ తనను, తన భర్త కొండలరావును మున్సిపల్ కమిషనర్ చెప్పేందుకు అవకాశం లేని బూతులు తిట్టడంతో మనస్తాపానికి గురై నిద్ర మాత్రలు మింగామని తెలిపారని పేర్కొన్నారు. ఈ కమిషనర్ కార్మికులను ఇష్టానుసారం దూషిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని వివరించారు. కమిషనర్ ఆర్ వెంకట రామిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా కరువు



బాబూస్ మేనిఫెస్టో రీకాలింగ్ క్యూఆర్ కోడ్ ఫ్ల కార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల ఆరోగ్యానికి భరోసా లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరు 28వ డివిజన్‌లో కొల్లిపాక సురేష్, వన్‌టౌన్‌లోని 7, 9, 10వ డివిజన్లలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకలపల్లి గణేష్, కొల్లిపర భగవాన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు.

జగన్ హయాం ఆదర్శనీయం

ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లకే డాక్టర్లను పంపి వైద్య చికిత్సలు చేయించారని, దేశానికే ఆదర్శంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ఏపీలో అమలు చేశారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించటంలేదని, ప్రజలు ఏదైనా అనారోగ్యం వస్తే అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. ప్రజలకు ఆరోగ్యం విషమిస్తే విజయవాడ, గుంటూరు హాస్పిటల్స్‌కు తరలించి చేతులు దులుపుకుంటున్నారని, కనీసం 108 వాహనం సైతం అందుబాటులో లేదని వివరించారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు సైదు కొండ, ఎండీ కైసర్, జంపనాగు, పోతురాజు, కోటి, బళ్ల రమేష్, ఉయ్యాల గణేష్, విజయ్, ఉదయ్‌భాస్కర్, పదం రాము, మరియమ్మ, కుమారి, నాగలక్ష్మి, రాజశేఖర్, అభిషేక్, వీరస్వామి, యర్రా సూర్యకిరణ్, తోటకూర కిషోర్, కొణిదల చిన్ని, బాల, గణేష్, రత్నం, సలీం, లకః్ః, డేనియల్, రాజేష్, ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు, వాణిజ్య సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్, తులసీ, తులసీ వర్మ, యువజన నాయకులు దాలి వెంకటేష్, సాయి ప్రదీప్, బండ్లమూడి సునీల్, సత్యనారాయణ, స్థానిక నేతలు, మహిళలు హాజరయ్యారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

ఏలూరు (మెట్రో): ప్లాస్టిక్ రహిత ఏలూరు జిల్లాగా తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు కలెక్టరేట్ ఆవరణలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలనపై నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. మానవాళి మనుగడకు ప్లాస్టిక్ నిర్మూలన ఎంతో ముఖ్యమని అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడడం ఆపి జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్మూలన జూట్ బ్యాగుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తొలుత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి నాంచారయ్య, పలు విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవర్లు వద్దు.. జూట్ బ్యాగులే ముద్దు

ఏలూరు టౌన్: రాబోయే భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎక్సైజ్ శాఖ ఏలూరు జిల్లా అధికారి ఆవులయ్య తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం సమీపంలో ప్రజలకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి పాండురంగారావు, సీఐ ధనరాజ్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై ర్యాలీ

దెందులూరు: ప్లాస్టిక్ వస్తువుల వాడకం భావితరాలకు భవిష్యత్తు శూన్యమని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయ్ కుమార్ రాజు అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్లాస్టిక్ వస్తువుల వాడకం నష్టంపై ఫ్లెక్సీలు పట్టుకుని వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. చాటుపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యశాఖాధికారి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రపై ఫ్లెక్సీలు చేతబట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఓ రామాంజనేయులు, సూపర్‌వైజర్ కిరణ్ కుమార్ పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ, అధికారులు



మహిళకు జూట్ బ్యాగు అందిస్తున్న ఆవులయ్య

కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలి

ఏలూరు (టూటౌన్): ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించి, పంటలు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి శనివారం ఆయన ఇంటి వద్ద రైతులు, కౌలు రైతులు వినతి పత్రం అందజేశారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో వెంకటాపురం, పోణంగి, కొమడవోలు తదితర ప్రాంతాల్లో వరి నారుమళ్లు ఎండిపోతున్నాయని తెలిపారు. కృష్ణా డెల్టాకు శివారు ప్రాంతం కావడంతో కాలువలు కూడా సక్రమంగా లేక సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా వస్తున్న నీరును తమ్మిలేరులోకి మళ్లించడం, గోదావరి కాల్వకు తూర్పులాకుల వద్ద పంపులు ఏర్పాటు చేసి గోదావరి నీటిని కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు అందించాలని విజ్ఞప్తి చేశారు. పంట కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన పూడిక తీయించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు ఎ.రమణ, రైతులు చిన్ని అర్జునరావు, తిరుమల శెట్టి జగదీశ్వరరావు, చిన్ని పోతురాజు, చిన్ని మోహన దుర్గాప్రసాద్, కస్తూరి శేఖర్, మక్కా రమణ, అలవాల హిమగిరి వరప్రసాద్, తలారి జయరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అండ్ ట్రేడ్ యూనియన్ నాయకులు డీసీఎల్ పి.శ్రీనివాస్, ఏసీఎల్ ఎ.నాగేశ్వరావులకు శనివారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లింగమల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న 35 వేల క్లెయిములను పరిష్కరించాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తేనే కార్మికులందరికీ ప్రయోజనం ఉంటుందన్నారు. ఆగస్టు 20న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పతివాడ రవి, ఉమా సాయి, కోడి రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రీనివాసపురం నూతన కమిటీ ఎన్నిక

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ శ్రీనివాసపురం గ్రామ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడిగా పోల్నాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా పోల్నాటి వరప్రసాద్, చల్లగాలి ఈశ్వర్‌రావు, సిర్రారాజేష్, వసంతాటి శివాజీ, కార్యదర్శులుగా ఎలికే సత్యనారాయణ, టెక్కెం రమేష్, జుజ్జవరపు శ్రీను, తానిగడప రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. నాగేంద్ర మాట్లాడుతూ నూతన కార్యవర్గం పార్టీ అభివృద్ధి కృషిచేయాలన్నారు. అలాగే కూటమి వైఫల్యాలను ప్రజలకు చేరవేయడానికి క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయాలన్నారు.

ఎండ, వాన దోబూచులాట

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గత 15 రోజులుగా ఏలూరు నగర వాసులు రెండో వేసవి తరహా వాతావరణాన్ని చవిచూస్తూ అపసోపాలు పడుతుండగా శనివారం కొంతమేర ఉపశమనం లభించింది. ఉదయం నిద్రలేచే సమయానికే వర్షం కురిసి ఆగిపోయి, వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు విపరీతంగా ఎండకాచి చెమటలు పట్టించింది. అనంతరం కొద్దికొద్దిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుని 12.45 గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభమైంది. దాదాపు గంట పాటు భారీ వాన కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. అనంతరం భానుడు తన ప్రతాపం చూపడంతో ఎండ చుర్రుమంది. రోజంతా ఇలా ఎండావానా దోబూచులాటతో ప్రజలకు భిన్నవాతావరణం ఒకే రోజు అనుభవమయింది.



భారీ వానకు వీధుల్లో ప్రవహిస్తున్న నీరు



స్కూటీపై వానలో తడుస్తూ..



ఏలూరులో మధ్యాహ్నం కురుస్తున్న జోరువాన



వాన అనంతరం ఎండ వాతావరణం



వానలో బండిపై వెళుతూ..

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	17
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	11
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	23